క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మరికల్: మండలంలోని కన్మనూర్, జిన్నారం, ఎక్లాస్‌పూర్, చిత్తనూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతు వేదిక వద్ద పంపిణీ చేసే కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అందజేయిస్తామన్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

మరికల్: మండల కేంద్రంలోని ప్రతిభ ఉన్నత పాఠశాలలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు కరస్పాడెంట్ హన్మంతురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మునీంద్ర, శివాచార్య, మహాస్వామి హాజరవుతారన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు: మండలంలోని రెనివట్లలో అక్రమంగా సేకరించిన ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాంలాల్ కథనం మేరకు.. రెనివట్ల గ్రామానికి చెందిన సద్దాం చుట్టు పక్కల గ్రామాల ఇండ్లను తక్కువ ధరకు రేషన్ బియ్యం సేకరించిన తన కిరాణ షాపులో ఎక్కువ ధరకు అమ్మేందుకు నిల్వ ఉంచడంతో నమ్మదగిన సమాచారం మేరకు.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించడంతో రేషన్ బియ్యం పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు పంచనామ అనంతరం అతడిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఊట్కూర్‌లో..

మండలంలోని మంగళవారం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుబడ్డ విషయమై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శంషోద్దీన్ బుధవారం తెలిపారు. మక్తల్‌కు చెందిన వెంకటేష్, ఆటో యజమాని విక్రమ్ శివారెడ్డి కలిసి 9 ప్లాస్టిక్ సంచుల్లో తరలిస్తుండగా గ్రామస్తులు సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కాలప్ప పంచనామ నిర్వహించారు. ఈ విషయమై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ షాప్ ప్రారంభం



మాగనూర్: మండల పరిధిలోని నేరడగండొడ్డిలో రేషన్ షాప్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనందగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న చౌకధర దుకాణాన్ని మంజూరు చేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి గ్రామస్తుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సలీం మాట్లాడుతూ.. గ్రామానికి రేషన్ షాప్ రావడంతో గ్రామస్తులకు సమయంతోపాటు డబ్బులు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ప్రవీణ్, మాజీ సర్పంచ్ తార, బస్వరాజు, మారుతి, వెంకటేష్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి



ధన్వాడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి వారి అభిప్రాయాలు, సూచనలు సేకరించి వాటికి అనుగుణంగా రైతులకు పథకాలు అందజేస్తున్నామని చెబుతున్న, ఇది కూడా గుర్తించకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న బీజేపీకి చిత్తశుద్ధి ఉండాలన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి విడతల వారీగా కూడా చేయకుండా రైతులను పట్టించుకోకపోతే బీజేపీ కనీసం వారికోసం నిరసనలు కూడా చేయలేదన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, రహిమన్‌ఖాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణకు వినతి

కోస్గి: ఎన్నో సంవత్సరాలుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు ఎంపీ డీకే అరుణకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు బుధవారం కోస్గిలో బీజేపీ ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు ఎంపీ హాజరుకావడంతో సమాచారం తెలుసుకున్న వారు ఎంపీని కలిసి తమ గోడు విన్నవించారు. కార్యక్రమంలో కోస్గి, గుండుమాల్ మండలాల పరిధిలోని అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడితే సీజ్

- నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై నజర్
- మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసునమోదు



నంబర్‌ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసిన ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ (ఫైల్)

మాగనూర్: రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ఆ వాహనం ఏదైనా ప్రమాదానికి గురై ఎవరైనా మృతిచెందితే.. ఆ వాహనాకి నంబర్ ప్లేట్ లేకుంటే. ఇక ఆ మరణించిన వ్యక్తిని గుర్తించే వరకూ పోలీసుల కంటి మీద కునుకు ఉండదు. నంబర్ లేని వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ముఖానికి ముసుగులు వేసి ఓ కాలనీలో చోరీకి పాల్పడి పరారైతే ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నా చోరికి పాల్పడిన వారిని గుర్తించడం పోలీసులకు కష్టంగా మారుతోంది. ఇలాంటి ఘటనలు దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు నవంబర్ ప్లేట్ లేని వాహనాలపై నజర్ పెట్టి, ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆయా పోలీస్‌స్టేషన్లకు ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. దీంతో జిల్లా వ్యాప్తంగా నంబర్‌లేకుండా తిరుగుతున్న వాటిని గుర్తించి సరైనా పత్రాలు లేని వాటిని సీజ్ చేయడం పత్రాలు ఉండి నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకుని వాహనదారులకు జరిమానాలు విధించడం వంటి చర్యలకు పోలీసులు నడుం భిగించారు.

ప్రతి ఐదింటిలో ఒక బండికి..

జిల్లా వ్యాప్తంగా నడుస్తున్న ద్విచక్ర వాహనాల్లో ప్రతి ఐదింటిలో ఒక వాహనానికి నంబర్ లేకుండా తిరుగుతున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. దీంతో నంబర్ లేకుండా తిరుగుతున్న వారు ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్లను తొలగించి వాహ నాలను నడుపుతున్నా? లేక ఏదైనా నేరాలకు పాల్పడిన సమయంలో కాని, ఇటీవల పోలీసులు ఫొటోలు తీసి జరిమానా వేయడాన్ని తప్పించుకోవడానికి అలా చేస్తున్నారా..? అనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రతి రోజూ ఎక్కడో ఒక్క చోట పోలీసులు స్పెషల్ డ్రైవ్‌తో తనిఖీలు చేపట్టి నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. నంబర్ లేకుండా తిరిగే వారిని నేరస్తులుగానే భావిస్తున్న పోలీసులు ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా వాహనాలను నడిపితేచట్టపరమైన చర్యలు తీసుకుంటామనిపోలీసులు హెచ్చరిస్తున్నారు. పోలీసులు నంబర్ లేకుండా తిరిగే వాహనాలను విడిచి పెట్టేది లేదని వారు పేర్కొంటున్నారు.

మైనర్లపై దృష్టి ..

ఇటీవల మైనర్ డ్రైవింగ్ పెరిగి పోవడంతో పలుచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో మైనర్ డ్రైవింగ్ చేసే వారిపై కూడా పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తుంది. డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్‌ల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తూ మైనర్లు డ్రైవింగ్ చేస్తే జరిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. రెండోసారి పట్టుబడితే ఆ వాహనాలను సీజ్ చేయడంతోపాటు వాహనం ఎవరి పేరుపై ఉందో వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నంబర్ లేకుంటే నేరస్తులే..



వాహనాలకు నంబర్ లేకుండా నడిపే వారందరూ నేరస్తులుగానే భావించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హై సెక్యూరిటీ ప్లేట్ వాడితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కొంత మంది ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్ తొలగించడం, నంబర్ కనిపించకుండా చేసి వాహనాలను నడుతున్నారు. ఉన్నతాధికారులు సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ నిబంధనలు ప్రకారం నడుచుకోవాలి. లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. – మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ఎస్ఐ

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్‌పుస్తకాలు అందిస్తున్న కృష్ణమాచారి

నారాయణపేట రూరల్ : విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా చక్కగా చదువుకుని మంచి మార్కులు సంపాదించాలని బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారి సూచించారు. పట్టణంలోని బీసీ బాలుర, బాలికల వసతిగృహాలను మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టిక, వంట సామాగ్రి వివరాలతో పాటు వసతి, మౌళిక వసతులను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి నోట్‌పుస్తకాలు అందించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు మసూద్, రేణుక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మొహర్రం..



ఓబ్లాపూర్‌లో నెలకొల్పిన పీర్లు

మాగనూర్: మండల పరిధిలోని ఓబ్లాపూర్‌లో మసీదు వద్ద మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హుస్సేన్ హుస్సేన్, ఖాసీం సాబ్ పీర్లను ప్రతిష్టించారు. పదిరోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 18న తెల్లవారు జామున భక్తుల ఆధ్వర్యంలో అగ్ని గుండం నిర్వహించనున్నట్లు మత పెద్దలు పెద్ద బాబు, ఎండీ ఆరిఫ్‌లు తెలిపారు. పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హుస్సేన్, ఖాసీం, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: త్యాగాలకు ప్రతీక అయిన మొహర్రం మండలంలో ప్రారంభమయింది. బుధవారం దర్గ పూజారి సుభాష్ విలేకరులతో మొహర్రం నెలలో నెలవంక కనిపించడంతో పీర్ల పెట్టెలను శుభ్రం చేసి మసీదులలో పీర్లను కొలువుదీర్చుతున్నట్లు తెలిపారు. అందుకు అవసరమయ్యే ఏర్పాట్లు తాగు నీరు, వసతి, భోజనం తదితర సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు.

మత్స్య కార్మికులకు చేయూత ఇవ్వాలి



మరికల్: రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కార్మికులకు చేయూత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా మండలంలోని బుధవారం గజ్జలమ్మ ఆలయం వద్ద వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులు దిన, దిన గండంగా కాలం వెళ్లదిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం తమను ఆదుకునేందుకు అర్హులైన వారికి పింఛన్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. శేఖర్, రామకృష్ణ, మొగులప్ప, కొండయ్య, రాజు, రమేష్, సాయితేజ, ఆంజనేయులు, నర్సింహులు, పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం



మక్తల్: పట్టణంలోని మత్స్య సంఘం నాయకులు బుధవారం మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లో ముదిరాజులకు మత్స్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి పంచిపట్టారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కావలి శ్రీహరి, డాక్టర్ శ్రీరాం, చందపూర్ శేఖర్, తిరుపతి, నర్సింహులు, ఆంజనేయులు, వాకిటి శ్యాం, బుగ్గప్ప, ప్రవీణ్, మధు, కిష్టప్ప, పృధ్విరాజ్, కట్ట వెంకటేష్, హన్మంతు, ఆంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతు పనుల్లో జాప్యం



మరమ్మతులు పూర్తి కానీ తాగునీటి పైపులైన్

అమరచింత: పట్టణంలోని కమ్మరి వీధితో పాటు పదోవార్డుకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వెంకటేష్ టీ హోటల్ సమీపంలో ప్రధాన రహదారికి పక్కన లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు ట్రాన్స్‌కో అధికారులు కొత్త విద్యుత్ లైన్ కోసం విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయడానికి డ్రిల్లింగ్ చేస్తుండగా మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్ పగిలింది. దీంతో తాగునీరు వృథాగా పారుతుండటంతో పైపులైన్ మరమ్మతు కోసం ఐదు రోజుల క్రితం గుంత తవ్వారు. పగిలిన పైపులైన్‌కు మరమ్మతు చేసిన లీకేజీ ఏర్పడుతుండటంతో తాగునీటిని ఆయా కాలనీలకు అందట్లేదు. హైస్కూల్‌లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు సైతం నీటితో నింపలేకపోతున్నారు. దీంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, వంట ఏజెన్సీ మహిళలు తాగునీటి ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ట్యాంక్‌కు నీటి సరఫరా నిలిపివేస్తుండటంతో బీసీ కాలనీ ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందట్లేదు. అధికారులు స్పందించి ఇప్పటికైనా మరమ్మతు పనులు పూర్తి స్థాయిలో చేసి ప్రజలకు తాగునీటిని అందించాలని కోరుతున్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

నర్వ: మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపుల ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను పంచాయతీ సిబ్బంది తొలగింపు పనులు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న ముసురు వర్షానికి ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను కట్టర్ మిషన్ ద్వారా తొలగింపు చేపట్టారు. రహదారులతో పాటు గ్రామంలోని కాలనీలో కూడా తొలగింపు పనులు చేపట్టాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



కోస్గిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



మక్తల్‌లో..



మరికల్‌లో

కోస్గి: తమ డిమాండ్లను పరిష్కరించాలని అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు మద్దతు ప్రకటించిన సీఐటీయూ నాయకులు హన్మంతు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్‌వాడీలకు పదవి విరమణ ప్రయోజనం రూ.2 లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల సంఘం ప్రతినిధులు చంద్రకళ, భారతీ, రమాదేవి, రాధిక, కళావతి, స్వాతి, లక్ష్మీ, రాధా, సత్యమ్మ, జరీనా పాల్గొన్నారు.

మక్తల్: కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని జిల్లా కో -కన్వీనర్ గోవిందురాజ్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంజు, విజయలక్ష్మి, రాధిక, గోవిందమ్మ, రాజేశ్వరి, సుజాత, లక్ష్మి, సురేఖ, వాణిశ్రీ, భాగ్యలక్ష్మి, శ్రీలత, చంద్రకళ, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఊట్కూరు: కేంద్ర ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ మమతకు వినతిపత్రం అందించారు. సంధ్యారాణి, బాలమణి, శివమ్మ, పద్మమ్మ, బేగం పాల్గొన్నారు.

మాగనూర్: సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్, శివకుమారి, శోభా, సీలమ్మ, ప్రసన్న, గౌరమ్మ, శాంతమ్మ, సత్యమ్మ, పారిజాత, అనంతమ్మ, రేణుక పాల్గొన్నారు.

ధన్వాడ: ఆశా కార్యకర్తలకు రూ.25వేలు కనీసవేతనం అందజేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరహరి, వెంకటేష్, ఆశా కార్యకర్తలు చంద్రకళ, మన్నూరాబేగం, భాగ్యమ్మ, శాంతి, అంజలిమణి, మాసమ్మ, విజయలక్ష్మి, అనురాధ, నర్సమ్మ, నర్సింగమ్మ పాల్గొన్నారు.

మరికల్: అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీతకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దూరు: అంగన్‌వాడీల, వీఓఏల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడారు.. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ మహేష్‌గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శశికళ, అంగన్‌వాడీలు అంజమ్మ, కళావతి, సులోచన, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నరహరి, కన్కప్ప, బుగ్గప్ప పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేయించాలి



పంట వివరాలను నమోదు చేస్తున్న డీఏఓ జాన్ సుధాకర్

కోస్గి: రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను ఏఈఓల ద్వారా విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని డీఏఓ జాన్ సుధాకర్ సూచించారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలో ఏఈఓలు చేపట్టిన పంటల సాగు నమోదు ప్రక్రియను మండల పరిధిలోని కొత్తపల్లిలో పరిశీలించారు. ఏఈఓలు తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో సాగు చేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయాలన్నారు. రైతులు సైతం తమ దగ్గరకు వచ్చిన వ్యవసాయ శాఖ అధికారులకు తమ పంటల వివరాలు అందజేయాలని సూచించారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించే పంటల సాగు వివరాలను రైతు బీమా, రైతు భరోసా, పంటల బీమాకు ప్రామాణికంగా తీసుకొంటుందని, రైతులు విధిగా తమ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో రైతుల పొలాల్ని పరిశీలించి వానా కాలంలో సాగుచేసిన పంటల వివరాలను నమోదు చేశారు. గ్రామంలో పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసిన రైతుల పొలాల్ని సందర్శించి పూత దశలో భూమిలో కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వినోద్‌తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

కృష్ణా: మహిళలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని షీ టీం సభ్యులు బాల్‌రాజ్, సమీన సూచించారు. బుధవారం మండలంలోని కున్సీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా సోషల్ మీడియా, సైబర్ క్రైం, గృహ హింసలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్న పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టిందుకు గాను అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు కల్పించిన చట్టాలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులు, నరేందర్, ఉష, సౌమ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం



గ్రామసభలో పాల్గొన్న నాయకులు

ఊట్కూరు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ప్రత్యేకాధికారి లక్ష్మీనర్సింహారాజు అన్నారు. బుధవారం పులిమామిడిలో గ్రామ సభ నిర్వహించారు. సమావేశంలో గ్రామంలో పారిశుధ్య పనుల గురించి చర్చించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలలో మొక్కలను నాటి పెంచాలన్నారు. మొక్కలు పెంచడంతో వాతావరణ కాలుష్యం తగ్గుతుందని ఆయన తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని, ఇంటి పరిసరాలలోని మురుగు గుంతలను పూడ్చివేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నసాయిలుగౌడ్, కతలప్ప, మాజీ ఎంపీటీసీ కిరణ్, గోవర్ధన్‌రెడ్డి, ఏఎన్ఎం గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



మక్తల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు



కృష్ణాలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్థానికులు

కృష్ణా: మండల పరిధిలోని ముడుమాల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నిజామూద్దీన్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన నూతన ఉపాధ్యాయులకు, ఈ పాఠశాలల నుంచి వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధితోపాటు విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, సంతోష్, ఆనంద, రేణుక, కవిత, కుర్మన్న, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని సంగంబండలో ప్రాథమికోన్నత పాఠశాలనుంచి ఉపాధ్యాయులు వెంకట్‌రాములు, రాజిరెడ్డి, పరమేశ్వరి బదిలీపై వెళ్లడంతో బుధవారం వారికి గ్రామస్తులు శాలువాతో సన్మానం చేశారు. అదేవిధంగా నూతన ఉపాధ్యాయులకు సన్మానించి స్వాగతం పలికారు. ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, బాల్‌రెడ్డి, అనిత,చంద్రకళ, సత్యారెడ్డి, సిద్ధార్థరెడ్డి, బాల్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

టీచర్‌కు జ్ఞాపిక అందజేత



నారాయణపేట రూరల్ : మండలంలోని బోయిన్‌పల్లి యూపీఎస్ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన బనదయ్య ఇటీవల పదోన్నతి పొందారు. ఆయనకు సీనియార్టీకి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌లో ప్రమోషన్ రావడంతో మొగల్‌మడ్కా జెడ్పీస్కూల్‌కు వెళ్లారు. కాగా పూర్వ పాఠశాలలో గ్రామస్తులు, విద్యార్థులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బుధవారం పిల్లలు ఆయన చిత్రపటం గీసి ఫ్రేమ్ కట్టించి బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ఏఏపీ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, నర్సింహులు, మల్లేష్, టీచర్ కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న నరహరి

మరికల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి అన్నారు. మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. 275మంది విద్యార్థులు ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో కనీస మౌళిక సదుపాయల లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరైనా టాయిలెట్స్, తాగునీరు లేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. నాణ్యత లేని భోజనం పెట్టడంతో ఇళ్ల వద్ద నుంచి టిఫిన్లు తెచ్చుకొని భోజనం చేస్తున్నారన్నారు. విద్యార్థులకు అధికారులు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి

నారాయణపేట: అంగన్‌వాడీ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ పార్క్ ఎదురుగా అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న ధర్నా ఐదోరోజు కొనసాగింది. ఈ మేరకు.. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండెగారి దస్తప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మల్లేష్ రిలేదీక్షలు చేపట్టిన పద్మమ్మ, నర్సింగమ్మ, మౌలానా, తిప్పమ్మ, లక్ష్మమ్మ, దీక్షలు ప్రారంభించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూర్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేసేందుకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గురువారం ఆత్మకూర్‌కు వస్తున్నట్లు తహసీల్దార్ రాజు, కాంగ్రెస్ నాయకులు పరమేష్, రహ్మతుల్లా, శ్రీను, తులసీరాజ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 76 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తారన్నారు.